www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 ఫిబ్రవరి 2025 | 5 | ఏలూరు



ఆరుగురు విద్యార్థినులకు అస్వస్థత


చికిత్స పొందుతున్న విద్యార్థులు

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని సుంకొల్లు గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. చాక్లెట్లు తినడంతో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యార్థినులు శుక్రవారం మధ్యాహ్నం పాఠశాల సమీపంలోని ఒక దుకాణంలో చాక్లెట్లు కొనుగోలు చేసి తిన్నారు. తిన్నతర్వాత కడుపు నొప్పితో పాటు ఒళ్లు చల్లబడి అస్వస్థతకు గురికావడంతో ఉపాధ్యాయులు ఆసుపత్రిలో చేర్పించారు. నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విద్యార్థినులు చికిత్స పొందుతున్నారు. చాక్లెట్లు తినడం వల్ల తమ పిల్లలు అస్వస్థతకు గురైనట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

రబీ ధాన్యం.. కొనుగోలుకు సన్నాహాలు..!

- ఏప్రిల్ 1 నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక
- సంచుల కొరత రాకుండా ముందస్తు కసరత్తు
- రెండు జిల్లాల్లో దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరిసాగు
- ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో జిల్లాకు మంచి పేరు
- కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభిస్తేనే రైతులకు మేలు
- ఇంకా రైతుల వద్ద ఖరీఫ్ ధాన్యం 3,500 మెట్రిక్ టన్నులు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీ ధాన్యం కొనుగోలు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభించాలనే ఆలోచనతో అధికారులు ముందుకు సాగుతున్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు నిమగ్నమయ్యారు. ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఇప్పటికే ధాన్యం కొనుగోలుకు సంబంధించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో జిల్లా అధికారులకు మంచి గుర్తింపు వచ్చింది. రబీలోనూ అంతే పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు సాగించాలని పౌర సరఫరాల శాఖాధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఏలూరు జిల్లాలో 70 వేలు, పశ్చిమగోదావరి జిల్లాలో 2.25 లక్షల ఎకరాలు కలిపి మొత్తంగా సుమారు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. రెండు జిల్లాలవ్యాప్తంగా దాదాపు పది లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉంది. జిల్లా రైతాంగానికి రబీ సాగు అత్యంత ముఖ్యమైంది. దిగుబడులు ఎక్కువగా వస్తాయనే ఆశ రైతుల్లో ఉంటుంది. రబీ ధాన్యం కొనుగోలులో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి రానుంది. ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు సంచుల కొరత, రవాణా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా ప్రారంభిస్తే ముందస్తుగా వచ్చే పంటను దళారులు అయినకాడికి కొనుగోలు చేసే పరిస్థితి ఉంటుంది. దీంతో రైతులకు మద్దతు ధర దక్కక తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడనుంది. ధాన్యం కొనుగోలు ముందుగా ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. రబీ ధాన్యం కొనుగోలుకు ఏలూరు జిల్లాలో 50 లక్షల వరకూ గోనె సంచులు అవసరం ఉంటుందని అంచనాతో అధికారులు సిద్ధం చేస్తున్నారు. పశ్చిమలోనూ అదేవిధంగా ముందుకు సాగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొన్న సమస్యలను గుర్తించిన అధికారులు ఖరీఫ్‌లో తగు జాగ్రత్తలు తీసుకున్నారు. రబీలో మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఖరీఫ్ ధాన్యం రవాణా వాహనాలకు సంబంధించి సొమ్ము చెల్లింపుల్లో కొంత ఆలస్యం కావడంతో వాహనాల యజమానుల్లో అసంతృప్తి నెలకొంది. రబీలో అటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. తేమశాతం ఇబ్బందులపైనా రబీలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. వాతావరణం సవ్యంగా ఉంటే తేమ ఇబ్బందులు ఉండవు. ఏమైనా మార్పులుంటే తేమ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై సానుకూలంగా

ప్రభుత్వం ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై సానుకూలంగా ముందుకు సాగుతోంది. ఇప్పటికీ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కొనసాగుతోంది. దెందులూరు, పెదపాడు వంటి మండలాల్లో ఇంకా కుప్పల రూపంలో ఖరీఫ్ ధాన్యం ఉండిపోయింది. రెండు మండలాల్లో దాదాపు 3,500 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ ధాన్యం సైతం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసిన తర్వాతే ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగుస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇది రైతులకు ఊరటనిచ్చే అంశంగా చెప్పొచ్చు. ఖరీఫ్‌కు సంబంధించిన ధాన్యం సొమ్ము సైతం రైతులకు పూర్తిస్థాయిలో జమ చేసినట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు.

వీధి కుక్కలకు యాంటీ రాబిస్ వ్యాక్సిన్



- మున్సిపాల్టీల పరిధిలో 590 కుక్కలకు బర్త్ కంట్రోల్ శస్త్ర చికిత్సలు
- వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు
- అన్నా క్యాంటీన్ నిర్వహణ వేళలను తనిఖీ చేయాలి
- కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో నాలుగు మున్సిపాల్టీల పరిధిలోని వీధికుక్కలకు యాంటీరాబీస్ వ్యాక్సిన్, బర్త్ కంట్రోల్ శస్త్రచికిత్సలను ఏప్రిల్ నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీల కమిషనర్లతో పురపాలక సంబంధిత అంశాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నాలుగు మున్సిపాల్టీల పరిధిలో సుమారు 2,400 వీధి కుక్కలను గుర్తించగా వాటిలో 45 రోజుల్లో 590 వీధి కుక్కలకు యాంటీరాబీస్ వ్యాక్సిన్, బర్త్ కంట్రోల్ శస్త్రచికిత్సలు చేశారన్నారు. మిగిలిన వాటికి రోజువారీ 50 కుక్కలకు యాంటీరాబీస్ వ్యాక్సిన్, బర్త్ కంట్రోల్ శస్త్రచికిత్సలు చేయించి ఏప్రిల్ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు.

వేసవిని దృష్టిలో పెట్టుకుని మున్సిపాల్టీల పరిధిలో తాగునీటికి సంబంధించిన అంశాలపై సమీక్షించారు. గ్రౌండ్‌వాటర్, బోర్‌వెల్స్, వాటర్ ట్యాంకులు, గోదావరి, కృష్ణా కెనాల్, తమ్మిలేరుకు సంబంధించిన తాగునీటి వనరుల్లో నీటి లభ్యతను గుర్తించి తాగునీటి పరీక్షల నిర్వహణ, క్లోరినేషన్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. అందుకు అనుగుణంగా మున్సిపాల్టీలవారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను తాగునీటి సమస్య లేకుండా కమిషనర్లు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, దీనికి సంబంధించి ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఇప్పటివరకు ఎన్ని కుళాయి కనెక్షన్లు మంజూరు చేశారని ఆరా తీశారు.

మున్సిపాల్టీల పరిధిలోని అన్నా క్యాంటీన్ల వద్ద పారిశుధ్యాన్ని, అన్నాక్యాంటీన్ నిర్వహణ వేళలు, భోజనం నాణ్యతపై తరచూ తనిఖీలు చేయాలన్నారు. ఒక్కో క్యాంటీన్‌కు ఇన్‌ఛార్జీలను కేటాయించాలని, వీటికి సంబంధించిన రోజువారీ నివేదికను ఫొటోల ద్వారా తమకు అందజేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని మున్సిపాల్టీల పరిధిలో పూర్తిస్థాయిలో వీధిలైట్లు వెలిగేలా చూడాలని, వాటికి సంబంధించిన నివేదికను రెండు రోజుల్లో అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా ఎక్కువ జనసంచారం ఉండే ప్రదేశాల్లో ఫ్లడ్‌లైట్ల పని తీరును సంబంధిత మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. పారిశుధ్యానికి సంబంధించిన అంశాలపై మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు సంబంధించి ఉదయం ఐదు గంటలకల్లా ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరును కమిషనర్లు పరిశీలించాలన్నారు. వ్యాపార దుకాణాల వద్ద అపరిశుభ్రంగా ఉంచితే షాపు యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. చంటిపిల్లల ఆధార్ నమోదు, మిస్సింగ్ ఎంప్లాయి, మిస్సింగ్ సిటిజన్స్, పెండెన్సీని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్‌లు ఎ.భానుప్రతాప్ (ఏలూరు), ఆర్.వెంకటరామిరెడ్డి (నూజివీడు), డి.పావని (చింతలపూడి), కెవి.రమణ (జంగారెడ్డిగూడెం) పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

ఏర్పాట్లపై సమీక్షించిన పరిశీలకులు సిహెచ్.శ్రీధర్


కలెక్టర్, జెసితో సమీక్షిస్తున్న ఎన్నికల పరిశీలకులు శ్రీధర్

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎన్నికల పరిశీలకులు సిహెచ్.శ్రీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై ఆయన కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో చర్చించారు. పోలింగ్ ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి 456 పోలింగ్ కేంద్రాల్లో 3,14,984 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారన్నారు. వీరిలో 1,83,347 మంది పురుషులు, 1,31,618 మంది మహిళలు, 19 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారన్నారు. ఏలూరు జిల్లాలో 66 పోలింగ్ కేంద్రాల్లో 42,282 మంది తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీరిలో 24,704 మంది పురుషులు, 17,571 మంది మహిళలు, ఏడుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారన్నారు. ఈ నెల 12న పిఒలు, ఎపిఒలు, మైక్రోఅబ్జర్వర్లకు శిక్షణ నిర్వహించామన్నారు. రెండో విడత ఈ నెల 22న ఉదయం పది గంటలకు గోదావరి సమావేశ మందిరంలో పిఒలు, ఎపిఒలు, జోనల్, రూట్ అధికారులకు శిక్షణ పూర్తి చేస్తామని తెలిపారు. ఓటర్ల స్లిప్పుల పంపిణీ ప్రక్రియ కూడా చేపట్టామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లను వివరించారు. ఎంసిసి, ఎఫ్ఎస్‌టి, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు కూడా ఏర్పాటు చేశామన్నారు. 456 పోలింగ్ కేంద్రాలకు 1199 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశామని, వాటిలో ఏలూరు జిల్లాకు సంబంధించి 66 పోలింగ్ కేంద్రాలకు 217 పెద్ద బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామన్నారు. 456 పోలింగ్ కేంద్రాలకు 2,714 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఏలూరు జిల్లా పరిధిలో 66 పోలింగ్ కేంద్రాలకు 400 మంది ఎన్నికల సిబ్బందిని నియమించామని వివరించారు.

తొలుత సాదర స్వాగతం

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలకు పరిశీలకులుగా నియమితులైన సిహెచ్. శ్రీధర్ శుక్రవారం ఏలూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఎన్నికల పరిశీలకులు సిహెచ్.శ్రీధర్‌కు పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. గతంలో ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన కె.సునీత స్థానంలో సిహెచ్.శ్రీధర్‌ను ఎన్నికల సంఘం నియమించింది. శ్రీధర్‌ను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, సహాయ ఎన్నికల అధికారి, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేశారు.

దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలి

ప్రజాసంఘాల ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేద, బడుగు, బలహీన వర్గాల గొంతుకైన పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఎపి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కామయ్యపాలెం, జీలుగుమిల్లి, ములగలంపల్లి, పి.నారాయణపురం, పి.రాజవరం గ్రామాల్లోని పాఠశాలల్లో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్.కొండలరావు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఇవే

రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్‌మీడియేటరీ స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు - రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్‌మీడియేటరీ, స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 26న ఆయా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా ఎన్నికల పోలింగ్ సామాగ్రిని ఎన్నికల సిబ్బందికి అందజేస్తారు. అదే విధంగా పోలింగ్ పూర్తయిన అనంతరం ఎన్నికల సామగ్రి చేర్చేందుకు ఆయా ప్రాంతాల్లో రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్‌మీడియేటరీ స్ట్రాంగ్‌రూమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. కాకినాడ జిల్లాకు సంబంధించి కాకినాడ కలెక్టరేట్‌లో, ఎఎస్ఆర్ జిల్లాకు సంబంధించి రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో, రామచంద్రాపురం విఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో, కొత్తపేట ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో, పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి భీమవరం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలు, తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోను, ఏలూరు జిల్లాకు సంబంధించి వట్లూరులోని సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో, జంగారెడ్డిగూడెంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఇంటర్‌మీడియేటరీ స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా జిల్లాల్లో ఇంటర్‌మీడియేటరీ స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రిని ఏలూరు జిల్లా వట్లూరులోని సిఆర్‌రెడ్డి కళాశాలకు తరలిస్తారు.

మార్చి మూడో తేదీన ఓట్ల లెక్కింపునకు ఏలూరు జిల్లా వట్లూరులోని సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలు

కాకినాడ జిల్లా : కాకినాడ ఎంసి.లారిన్ హైస్కూల్, పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయం

ఎఎస్ఆర్ జిల్లా: రంపచోడవరం సబ్ కలెక్టర్ ఆఫీసు, చింతూరు సబ్ కలెక్టర్ కార్యాలయం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా: అమలాపురం అగ్రహారంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, రామచంద్రాపురంలోని విఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల, కొత్తపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

పశ్చిమగోదావరి జిల్లా: భీమవరం, నర్సాపురం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కార్యాలయాలు

తూర్పుగోదావరి జిల్లా: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల

ఏలూరు జిల్లా: ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని గిరిజన భవన్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం

ఏజెన్సీలో వైద్యం అందని ద్రాక్షేనా..!

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏజెన్సీలో గిరిజనులు వైద్యం కోసం అల్లాడుతున్నారని, వారికి వైద్యం అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కుక్కునూరులో వైద్యం సకాలంలో అందక అనారోగ్యంతో రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో చేరిన దేవమ్మ మృతి చెందడం తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. టెక్నాలజీ పెరిగినా ఇంకా ఏజెన్సీ గిరిజనులకు వైద్యం సకాలంలో అందించలేని దుస్థితిలో ప్రభుత్వాలు ఉండడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు. కుక్కునూరు నుండి బండారిగూడెం వరకు రోడ్డు లేకపోవడంతో దేవమ్మ మృతదేహాన్ని మూడు కిలోమీటర్లు మేర డోలిలో తీసుకెళ్లాల్సి రావడం పాలకులకు సిగ్గుచేటని తెలిపారు. ఏజెన్సీలో సరైన రోడ్లు, తాగునీటి సౌకర్యం, వైద్య సేవలు అందుబాటులో లేక గిరిజనులు అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఏదోక చోట రోడ్లు వేసి మొత్తం గిరిజన ప్రాంతాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసినట్లు ప్రచారం చేసుకుంటున్న రాజకీయ నాయకులు దేవమ్మ మృతికి ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఏజెన్సీ మారుమూల ప్రాంతాలకు కనీస సౌకర్యాలు కల్పించాలని, మొబైల్ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, వైద్యం, ఇతర అవసరాలకు తగ్గట్టుగా రవాణా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

గ్రూపు-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కోఆర్డినేషన్ అధికారి పి.ధాత్రిరెడ్డి

ఏలూరు : జిల్లాలో ఈనెల 23న ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో జరుగు గ్రూప్-2 పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్, గ్రూపు-2 పరీక్షల జిల్లా కో-ఆర్డినేషన్ అధికారి పి.ధాత్రిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని జెసి ఛాంబర్‌లో గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ సభ్యులు, లైజన్ అధికారులు, పరీక్షల కేంద్రం చీఫ్ సూపరిటెండెంట్లు, పోలీసు అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈనెల 23వ తేదీ ఆదివారం నిర్వహించే గ్రూపు-2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సమాచారం నిమిత్తం సహాయ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఆరోజున ట్రాఫిక్ అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, నిరంతర విద్యుత్ సరఫరా, మెడికల్ క్యాంపులు ప్రతి పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సెక్షన్ 163 ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. ఏలూరు జిల్లాలో గ్రూపు-2 పరీక్షలు సజావుగా నిర్వహించడానికి సంబంధిత అధికారులు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ వారి సూచనల ప్రకారం పనిచేయాలని ఆమె ఆదేశించారు. గ్రూపు-2 పరీక్షల సమాచారం నిమిత్తం జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో సహాయ కేంద్రం ఏర్పాటు చేయడమైనదన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే 9912244293, 80085 39786 ఫోన్‌నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

'హమాలీలకు కూలి రేట్లు పెంచాలి'

భీమడోలు : సివిల్ సప్లై(పౌరసరఫరాల సంస్థ) హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచుతూ జిఒ విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, మండల స్థాయి గోదాములు, పాతూరు శాఖకు చెందిన సివిల్ సప్లై హమాలీ కార్మికుల యూనియన్ డిమాండ్ చేసింది. ఈమేరకు శుక్రవారం గోదాముల వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం పనిని నిలిపివేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు త్రిమూర్తులు, దుర్గారావు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల క్రితం యూనియన్‌తో చర్చల సందర్భంగా కలిసిన సంబంధిత శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూలీరేట్లు పెంచేందుకు అంగీకరించాలన్నారు. కానీ ఇంతవరకు సంబంధిత జిఒ జారీకాని కారణంగా వాగ్దానాలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. సివిల్ సప్లై హమాలీ, వర్కర్స్ యూనియన్ గత ఏడు నెలల కాలంగా ప్రస్తుత ప్రభుత్వాన్ని, మంత్రులు, సంబంధిత అధికారులను పలుమార్లు సమస్య పరిష్కారం కోరుతూ కలిసిందన్నారు. వాస్తవానికి పెరిగిన కూలీ రేట్ల అమలు 2024వ సంవత్సరం జనవరి నుంచి అమలు కావలసి ఉందని తెలిపారు. ఈ విషయాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలో కూలీ రేట్ల పెంపుకు హామీ ఇచ్చిందన్నారు. కూలీరేట్ల పెంపును 2024వ సంవత్సరం జనవరి నుంచి అమలు చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని పాతూరు యూనియన్ నాయకులు తెలిపారు.

బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా నిర్వహిస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

ఏలూరు అర్బన్ : బ్యాంకులో తగినత ఉద్యోగ నియమకాలు చేపట్టాలని, వారానికి 5 రోజుల పనిదినాలు కల్పించాలని, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, జౌట్ సోర్సింగ్ ఉద్యోగాలు నిలిపివేయాలని యుఎఫ్‌బియు జిల్లా కన్వీనర్ కాళే శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్స్ పిలుపు మేరకు మార్చి 24, 25 తేదీలలో బ్యాంకు ఉద్యోగుల దేశవ్యాప్త రెండు రోజుల సమ్మెకు ముందుస్తు నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యుఎఫ్‌బియు జిల్లా కన్వీనర్ కాళే శ్రీనివాసరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వలె గ్రాట్యూటీ రూ.25 లక్షలకు పెంచి ఇన్కమ్ టాక్స్ రాయితీ ఇవ్వాలని, బ్యాంకు ఉద్యోగులపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ మోహన్, ఎన్.లక్ష్మణరావు, శ్రీనివాస్, రత్న విమల్, రిటైర్ యూనియన్ నాయకులు నారాయణ రావు పాల్గొని ప్రసంగించారు. వివిధ బ్యాంకుల నుంచి సుమారు 200 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

పురుష పదజాలం వాడినందుకు క్షమించాలి : మున్సిపల్ కమిషనర్

ఏలూరు సిటీ : సచివాలయం సిబ్బందితో గురువారం జరిగిన రివ్యూ మీటింగ్‌లో సిబ్బందిపై పురుష పదజాలం వాడడం జరిగిందని, అందులో భాగంగా ఒక కులం పేరును తీసుకురావడం జరిగిందని, దానికి పత్రికా ముఖంగా బహిరంగ క్షమాపణ తెలియజేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్ అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని రకాల సర్వేల్లో ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆఖరి స్థానంలో ఉండడంతో ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఎక్కువ అవ్వడంతో సిబ్బందిపై అలా మాట్లాడడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో ఇట్లాంటివి పునరావృతం కాకుండా చూసుకుంటానని అన్నారు. వసూళ్ల విషయంలో ఏలూరు కార్పొరేషన్ చాలా వెనకబడి ఉందని, నీటి పన్ను కేవలం 18 శాతం మాత్రమే వసూలు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు మంచి పాలన అందిస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బడేటి చంటి

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు

ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నామని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ప్రజలు కూడా దీనికి పూర్తిస్థాయిలో సహకరించాలని, నీటిని వృథా కాకుండా చూసుకోవాలని సూచించారు. ఏలూరు కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం కార్పొరేషన్ డిఇలు, ఎఇలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎంఎల్‌ఎ బడేటి చంటితోపాటు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పాల్గొని నియోజకవర్గంలో రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా జాప్యం లేకుండా తక్షణ చర్యలే లక్ష్యంగా అధికారులంతా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. మల్కాపురం వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ వద్ద కొత్త మోటార్లను వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు. ఆ ప్రాంతంలో అవసరాన్నిబట్టి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ఏర్పాటు చేశారన్నారు. ఇక ట్యాంకులో నాచును తొలగించేందుకు ప్రత్యేక బోటును ఏలూరు రప్పిస్తున్నామని తెలిపారు. తాగునీరు వధా కాకుండా జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి ఎక్కడా తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్.పెదబాబు, ఎలక్ట్రికల్ ఎఇ సాంబశివరావు, డిఇలు రజాక్, కొండలరావు, తాతబ్బాయ్, డి.మ్యాన్‌అజయ్, ఎఇలు సాయి, అరుణ్‌దేవ్, సంధ్య, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ తొలగించడం దుర్మార్గం : సిఐటియు

ఏలూరు అర్బన్ : ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా నగరపాలక సంస్థ అధికారులు ఆటో స్టాండ్‌ను తొలగించడాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య తీవ్రంగా ఖండించారు. గత 30 సంవత్సరాలుగా మున్సిపల్ ఆఫీస్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసుకున్న ఆటో స్టాండ్‌ను అధికారులు అక్రమంగా తొలగించడానికి నిరసనగా శుక్రవారం ఆటో కార్మికులు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ఏలూరు నగరంలో దాదాపు 6 వేల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, మున్సిపల్ ఆఫీసు స్టాండ్ వద్ద 300 మంది ఆటో డ్రైవర్లు తమ జీవనం సాగిస్తుంటే ఏలూరులో పరిశ్రమలు మూతపడినా నోరు మెదపని పాలకులు స్మార్ట్ సిటీ పేరుతో ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టేందుకు సిద్ధమవుతారా? ఇదెక్కడి న్యాయం అంటూ నిలదీశారు. అనంతరం ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ అమర్ కుమార్, జె.గోపి మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యేవరకు సిఐటియు అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఆటో స్టాండ్ ప్రెసిడెంట్ రాజారావు, సెక్రటరీ సుందర్ రావు, వైష్ణవ్ ప్రసాద్, సందీప్, త్రినాథ్ నాయకత్వం వహించారు.

సంపద సృష్టిపై శిక్షణ

ఉంగుటూరు : పంచాయతీలో ఘన, ద్రవ వ్యర్థాలతో సంపద సృష్టించి స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం అమలుకు కృషి చేయాలని ఉంగుటూరు ఎంపిడిఒ గంజి రాజ్ మనోజ్ అన్నారు. ఉంగుటూరు సంపద సృష్టి కేంద్రంలో శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామారావు, పంచాయతీ కార్యదర్శి బొడ్డు రవిచంద్ర కుమార్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ రమేష్

ముసునూరు : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బలివే రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ ఉప కమిషనర్ డిఎల్‌వి.రమేష్ బాబు అన్నారు. శుకవారం మండలంలోని బలివే గ్రామంలో వేంచేసివున్న బలేరామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలు ఈనెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్న సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా దైవదర్శనం కల్పించడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఎంఎల్‌సి పోలింగ్ కేంద్రం పరిశీలన

ముసునూరు: ఎంఎల్‌సి ఎన్నికల్లో భాగంగా మండలంలోని పోలింగ్ కేంద్రాన్ని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ రాజ్ పరిశీలించారు. శుక్రవారం మండలంలోని ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహాశీల్దార్ కె.రాజకుమార్ ఆధ్వర్యంలో ఆయన పరిశీలించారు. అక్కిరెడ్డిగూడెం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే కూడా పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు.

ఉత్సవాల్లో భక్తులకు రక్షణ కల్పిస్తాం : డిఎస్‌పి

పోలవరం: పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు పూర్తి స్థాయి రక్షణ కల్పిస్తామని డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను ఆయన, జంగారెడ్డిగూడెం విద్యుత్ శాఖ డిఇ ఫీర్ మహ్మద్, సిఐ బాలసురేష్ బాబు, ఎస్ఐ పవన్ కుమార్‌లతో కలిసి పరిశీలించారు. భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బారికేడింగ్, విద్యుత్ దీపాలంకరణ, మంచినీటి సౌకర్యాలు, నదీ తీరంలో మరుగుదొడ్లు, బట్టలు మార్చుకునే గదులు, చలువ పందిళ్లు, కాలినడక మార్గం ఏర్పాట్లు, నదిపై డ్రెజ్జింగ్ పనులు, ఇసుక తిన్నెల్లో వాచ్ టవర్ల ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు, సిబ్బంది వెంకట్రాజు పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్య నమోదు విధానం తనిఖీ

నూజివీడు టౌన్ : మండల పరిధిలోగల ముక్కొల్లపాడు గ్రామంలో రైతు విశిష్ట సంఖ్య నమోదు విధానం జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌కె.హబీబ్ బాషా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో విశిష్ట సంఖ్య నమోదు ప్రతి పిఎం కిసాన్ లబ్ధి రైతులు ఈనెల 24వ తేదీ లోపల పూర్తి చేయాలని వ్యవసాయ ఉద్యాన శాఖ సహాయకులకు, మండల వ్యవసాయ అధికారినికి ఆదేశించారు. అనంతరం విశిష్ట సంఖ్య నమోదుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. నూజివీడు సహాయ వ్యవసాయ అధికారి జి.విద్యాసాగర్, మండల వ్యవసాయ అధికారిని చాముండేశ్వరి పాల్గొన్నారు.

ముసునూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండును ఒక్కొక్క రైతుకు ఒక్కొక్క విశిష్ట ఐడి నెంబర్లను రూపొందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి సిహెచ్.విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాటన్ పాడు రైతు సేవా కేంద్రం ఆయన పరిశీలించారు. వ్యవసాయ అధికారులు కాటన్ పాడు గ్రామంలో ఆకస్మికంగా తనిఖీ చేసి ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయాల్సిందిగా ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి కెసిహెచ్.సూరిబాబు పాల్గొన్నారు.

మదినేపల్లి : రైతులందరూ త్వరితగతిన విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాష అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాష మాట్లాడుతూ రైతులందరూ విధిగా విశిష్ట గుర్తింపు సంఖ్యను త్వరితగతిన పొందాలన్నారు. మండవల్లి ఎడిఎ జి.వెంకటమణి, మండల వ్యవసాయ అధికారి బి.వేణుమాధవ్ పాల్గొన్నారు.

మహిళలపై దాడి

నేరాలు - ఘోరాలు

ముదినేపల్లి: దారి బాగు చేస్తున్న మహిళలను స్థానికులు కులం పేరుతో దూషించి, కొట్టి గాయపరిచినట్లు ఇరువురు మహిళలు శుక్రవారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గుంటూరు జిల్లా మంగళగిరి ప్రకాష్ నగర్‌కు చెందిన సిహెచ్.రాణి, ఎస్.జ్యోతిలు ముదినేపల్లిలోని బి.కన్వెన్షన్(కళ్యాణ మండపం)లో రెండు నెలల నుంచి పనిచేసి జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం మండపం యజమాని దారి బాగు చేయమని వీరికి చెప్పాడు. ఇరువురు మహిళలు దారి బాగు చేస్తుండగా దారి పక్కనే నివాసం ఉంటున్న సత్యనారాయణ, పామర్తి సీతామహాలక్ష్మి అనువారు వారి భార్యతో వచ్చి దారి బాగు చేయడానికి వీలు లేదు అని అసభ్యకరమైన కులం పేరుతో దూషిస్తూ మహిళల జుట్టు పట్టుకుని చేతులతో, నాపరాళ్లతో కొట్టినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంఘటనలో జ్యోతి, రాణికకు గాయాలు కావడంతో గుడివాడ ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. జరిగిన ఈ సంఘటనపై విచారణ చేసి తమకు న్యాయం చేయాల్సిందిగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ట్రక్ ధ్వంసంపై కేసు

భీమడోలు: భీమడోలు గ్రామంలో ట్రక్కును ధ్వంసం చేసిన వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు గ్రామపంచాయతీ పరిధిలోని లింగంపాలెం అవాస ప్రాంతానికి చెందిన కోన అశోక్ కుమార్‌కు భీమడోలు సంతపేట ప్రాంతానికి చెందిన ట్రక్ యజమాని నిమ్మగడ్డ మణికుమార్ కుమారునితో వ్యక్తిగత విభేదాలు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని అశోక్ కుమార్ గురువారం రాత్రి మణికుమార్‌కు చెందిన ట్రక్కు ధ్వంసం చేసినట్లు మణికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్ దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా విక్రేతలు అరెస్ట్

ముసునూరు : నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 అనే కార్యక్రమంలో భాగంగా ఏలూరు ఇన్‌ఎస్‌టిఎఫ్ సిబ్బంది శుక్రవారం మండలంలోని చెక్కపల్లి గ్రామంలో దాడులు నిర్వహించారు. 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల నాటుసారాయిని స్వాధీన పరచుకొని, తాతా మహేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.పుష్పారావు తెలిపారు. ఈ దాడులలో ఇన్‌ఎస్‌టిఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కెఎంకె అరిఫ్ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండలంలోని తూర్పు దిగవల్లి గ్రామంలో అనధికారంగా మద్యం విక్రయిస్తున్న ప్రొద్దుటూరి వెంకటేశ్వరరావు తండ్రి కృష్ణను అదుపులోకి తీసుకొని 6 మద్యం సీసాలను స్వాధీనపరచుకొని, కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ మస్తానయ్య తెలిపారు. ఈ దాడులలో ఇన్‌ఎస్‌టిఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కెఎంకె అరిఫ్, సిబ్బంది, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వై.ఈశ్వర రావు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

జీలుగుమిల్లి : మండలంలోని హెచ్‌పి గ్యాస్ గోడౌన్ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి పోలీసులు, సిబ్బంది ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌కు ఐచర్ వాహనంలో 20 ఆవులు, 35 ఎద్దులను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ పి.నవీన్ కుమార్ తెలిపారు. ఆవులను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిర్లక్ష్యంగా రహదారి పనులు


నివాసాల మధ్య మురుగునీరు
దుర్వాసన వెదజల్లుతున్న వైనం
కానరాని అధికారులు

ప్రజాశక్తి - మండవల్లి

రహదారి అభివృద్ధి పనులు కాంట్రాక్టర్‌కు కాసులు, ప్రజలకు రోగాలు అనే చందాన ఉన్నదనే విమర్శలున్నాయి. నెలల తరబడి నివాసాల మధ్య మురుగునీరు నిల్వ ఉండి, దోమలు వ్యాప్తి చెంది దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. దోమల వల్ల ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయని భయాందోళన చెందుతున్నారు. కాంట్రాక్టర్‌కు సమస్య తలెత్తితే వాలిపోయే అధికారులు ప్రజలు పడుతున్న ఇబ్బందులపై కన్నెత్తి చూడకపోవడం బాధాకరమని విమర్శిస్తున్నారు. దీంతో అధికారులు ఉన్నది కాంట్రాక్టర్ల కోసమా? ప్రజల కోసమా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్న వైనం మండవల్లిలో చోటుచేసుకుంది.

గ్రామస్తుల కథనం ప్రకారం.. జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా మండవల్లిలో డ్రెయినేజీ నిర్మాణం పనులు చేపట్టారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ పూర్తి కాలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా నిర్వహించిన పనులతో విద్యుత్ వైర్లు కలిసిపోయి, అధిక విద్యుత్ ప్రసారమై, గృహోపకరణాలు కాలిపోయి లక్షల్లో నష్టం వాటిల్లడంతోపాటు డ్రెయినేజీ నిర్మించే క్రమంలో కార్మికుడు మృతి చెంది, ఎంతోమంది ప్రమాదాల బారిన పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయని వారు స్పష్టం చేస్తున్నారు. అంతేకాకుండా కుళాయి పైపులు ధ్వంసమై, నెలల తరబడి తాగునీరందక ఇబ్బందులకు గురవ్వడంతో పాటు దుమ్ము చెలరేగి నివాసాలకు చేరుకుని, వ్యాధుల బారిన పడ్డామని వారు వివరిస్తున్నారు. ప్రస్తుతం ఇండియన్ బ్యాంకు వద్ద నుంచి వెలమపేట వరకు రహదారిని గుంతగా తవ్వి నేటికీ 45 రోజులు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో మురుగునీరు చేరి కాలువను తలపిస్తుంది. మురుగు నీటిలో దోమలు వ్యాప్తి చెంది పట్టపగలే ముసురుతున్నాయని, దుర్వాసనతో ఉండలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రామాలయానికి వెళ్లే రహదారిని మురుగునీరు ముంచెత్తిందని, మురుగునీటిలో రాకపోకలు సాగించేందుకు నానఅవస్థలు పడడంతో పాటు వ్యాధుల ప్రభావం భయాందోళన చెందిస్తుందని వారు వాపోతున్నారు. ప్రజలు ఇంత ఇబ్బందిపడుతున్నా.. పట్టించుకున్న నాథుడే లేడు. ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకునే అధికారులకు ప్రజా సమస్యలు పట్టవా అంటూ వారు నిలదీస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, వ్యాధుల బారి నుంచి ప్రజలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎన్‌హెచ్ ఎఇ శరత్‌ను వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


రోడ్డుపై నిలిచిన మురుగు నీరు


నివాసాల మధ్యకు చేరిన మురుగునీరు

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి - చింతలపూడి

మాతృభాష తల్లితో సమానం, మనం తల్లిని ఎంత గౌరవిస్తామో మాతృభాషను కూడా అంతే గౌరవించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి, అప్పుడే ఆ వ్యక్తి సంపూర్ణ విజ్ఞానవంతుడు అవుతాడని ఆయన తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడిలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె.నరేంద్ర కుమార్ మాట్లాడారు. ఆర్థిక శాఖ విభాగాధిపతి శంకర పోలయ్య జంతుశాస్త్ర అధ్యాపకులు, బి.వెంకటేశ్వరరావు, ఎకనామిక్స్ అధ్యాపకులు డాక్టర్ ఎం.సుబ్బారావు, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు శ్రీఉమా శంకర్ ఉన్నారు.

బుట్టాయగూడెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బుట్టాయగూడెంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పియువిఎన్.మనేంద్రరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ మన అభివృద్ధి సాధనకు ఎన్నో భాషలు నేర్చుకోవచ్చు కానీ, అమ్మను మర్చిపోకుండా ఎలాగైతే ఉంటామో అలాగే మాతృభాషను మర్చిపోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఆకులన్న తెలుగు అధ్యాపకురాలు వై.సునీత పాల్గొన్నారు.

టి.నరసాపురం : మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అరసం రాష్ట్ర కార్యదర్శి బిఎన్.సాగర్ అన్నారు. స్థానిక విజన్ హైస్కూల్‌లో అభ్యుదయ రచయితల సంఘం(అరసం) విజన్ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం విజన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అరసం రాష్ట్ర కార్యదర్శి బిఎన్ సాగర్ మాట్లాడుతూ తూర్పు పాకిస్తాన్ సంఘటనను గుర్తు చేస్తూ, భాషకోసం ప్రాణాలర్పించిన ఐదుగురు విద్యార్థుల అమరత్వాన్ని గుర్తు చేశారు. అనంతరం మాతృ భాషా దినోత్సవం వకృత్వ పోటీల్లో విజేతలకు కవితా స్రవంతి పుస్తకాలను బహూకరించారు.

భీమడోలు : మాతృభాషను పరిరక్షించుకుందామని మండల పరిషత్ జెఎంఎం పురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మలా కుమారి, ఉపాధ్యాయులు మండే సుధాకర్ కోరారు. వీరి ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ షేక్ షీమా పాల్గొన్నారు.

దెందులూరు : ఏ మనిషైనా మొట్టమొదటిగా అమ్మ ఒడిలో ఉగ్గుపాలతో సహా నేర్చుకునే భాషే మాతృభాష అని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుగ్గులోతు కృష్ణ తెలిపారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఇందిరా కాలనీ ఏలూరులో ఈరోజు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుగ్గులోతు కృష్ణ మాట్లాడుతూ ఎవరికైనా వారి అమ్మ మీద, పుట్టిన గడ్డ మీద ఎలాంటి మమకారం ఉంటుందో వారి మాతృభాష మీద కూడా అంత ప్రేమ ఉండాలి అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.శ్రీనివాసరావు, కె.కృష్ణకుమారి, జి.రమాకుమారి పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మధ్యాహ్నం కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యాబోధనకు, అభ్యసనానికి, మాతృభాషకు మించిన సాధనం లేదని, మాతృభాషలో పట్టు సాధించిన వారు ఇతర భాషలు సులభంగా నేర్చుకోగలరని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు డాక్టర్ ఎం.విజయ కుమార్, టి.వెంకట దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పోలవరం : మాతృభాషా దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలలలో మాతృమూర్తులకు పేరెంట్స్ డే నిర్వహించి విద్యార్థులతో వారి తల్లులకు పాదపూజలు నిర్వహించారు. పోలవరం, నూతనగూడెం, బిసి కాలనీ, కృష్ణారావుపేట, బంగారమ్మపేట, పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల ప్రభుత్వ పాఠశాలలలో, శ్రీసాయి విజ్ఞాన భారతి, విజ్ఞానజ్యోతి పాఠశాలలలో మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : మండలంలోని స్థానిక పంగిడి హైస్కూల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రధానోపాధ్యాయులు పి.సురేష్ అధ్యక్షత వహించి, విద్యార్థుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ మన మాతృభాష అయిన తెలుగు భాషను గౌరవించాలన్నారు. ఉపాధ్యాయులు మల్లయ్య, కుమార్ స్వామి, శారద, ప్రభాకర్, పద్మ పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో..

విద్యార్థులకు స్వీయరక్షణ పద్ధతులపై అవగాహన

చాట్రాయి : అభయ మహిళ రక్షక దళ సభ్యులు స్థానిక విద్యాసంస్థల విద్యార్థులకు మహిళా భద్రత, అత్యవసర పరిస్థితులలో స్పందించే విధానాలు, హెల్ప్‌లైన్, 112 ఎమర్జెన్సీ సర్వీస్‌ల వినియోగం వంటి ముఖ్యమైన విషయాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అభయ మహిళా రక్షక దళ సభ్యులు వివరించారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, స్వీయరక్షణ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చాట్రాయి ఎస్ఐ డి.రామకృష్ణ మాట్లాడుతూ మహిళా భద్రత ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలలో ఒకటిగా ఉండాలని, ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించి సమాజంలో సానుకూల మార్పులకు సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అభయ రక్షక దళ వాహనం ద్వారా గ్రామాల్లో, పట్టణాల్లో మహిళలకు భద్రతా అవగాహన కల్పించడం తమ ప్రధాన లక్ష్యమన్నారు. సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్లు 112(అత్యవసర పరిస్థితుల్లో), 1930 (సైబర్ నేరాలు), 1098 (బాల్య వివాహాలు) ద్వారా సహాయం పొందాలని అన్నారు.


నూజివీడు టౌన్ : జిల్లా వ్యాప్తంగా అభయ రక్షక వాహనం ప్రతి స్కూల్, కాలేజ్, అన్ని ముఖ్యమైన ఏరియాల్లో పర్యటిస్తూ శుక్రవారం పర్యటనలో భాగంగా నూజివీడు మండలం యనమదల గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

ఆగిరిపల్లి: విద్యార్థులకు మదర్ థెరిస్సా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించి, వైద్య పరీక్షలు నిర్వహించటం ఎంతో అభినందనీయమని ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు పి.పుష్పలత అన్నారు. శుక్రవారం ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మదర్ థెరిస్సా సేవా ట్రస్టు ఛైర్మన్ తిరివీధి కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు.

28న టైలర్స్ డే

నూజివీడు టౌన్ : ఈనెల 28వ తేదీన జరగబోవు టైలర్స్ డే కార్యక్రమానికి మంత్రి కార్యాలయంలో శుక్రవారం మంత్రి కొలుసు పార్థసారధిని ఆహ్వానించినట్లు నూజివీడు టైలర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు తొలుత మంత్రికి పూలమాల, బొకే, శాలువాతో సన్మానించారు. అనంతరం అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎండి రఫీ మంత్రితో మాట్లాడుతూ టైలర్స్ కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలని అడగగా మంత్రి సానుకూలంగా స్పందించి, స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ షేక్ షబ్బీర్, గౌరవ అధ్యక్షులు దాసిరెడ్డి అనిల్ కుమార్, పి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు, గాల్సిద్, యాసీన్, సుబ్బారావు పాల్గొన్నారు.


మంత్రిని సత్కరిస్తున్న సభ్యులు

క్రీడలు ఐక్యతను పెంపొందిస్తాయి : మంత్రి

ఆగిరిపల్లి: క్రీడలు విద్యార్థుల్లో జాతీయ ఐక్యతను పెంపొందించడంతో పాటు మానసిక, శారీరక దృఢత్వానికి దోహదపడతాయని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శుక్రవారం ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రెండు రోజుల పాటు జరిగే నూజివీడు నియోజకవర్గ సబ్‌జోన్ ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సబ్‌జోన్ పోటీల్లో 800 మంది విద్యార్థులు పాల్గొనగా, 50 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పోటీల నిర్వహణ బాధ్యతలను చేపట్టారు.

దోమల వృద్ధిని అరిట్టాలి

మలేరియా అధికారి ప్రసాద్

ఏలూరు సిటీ : దోమల వృద్ధిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రై డే ఆచరించాలని మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ సూచించారు. ఏలూరులోని పట్టణ ఆరోగ్య కేంద్రం పవర్ పేట, కొత్తపేట సచివాలయం పరిధిలో దాసరి ఎర్రయ్య వీధిలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ అపరిశుభ్ర పరిసరాల వల్ల దోమలు ఎక్కువగా వృద్ధి చెంది ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్‌గునియా మొదలగు వ్యాధులు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. దోమకాటు కంటికి కనిపించదని, కానీ దాని ద్వారా ముప్పు చాలా ఉందని, కాబట్టి ప్రజలు దోమల నిర్మూలనలో భాగస్వామి కావాలని, అప్పుడే దోమల ద్వారా వచ్చే వ్యాధులు అరికట్టవచ్చునని సూచించారు. నీళ్ల తొట్టెలు వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలని, నీటి నిల్వ ప్రాంతాలలో వాడేసిన ఇంజన్ ఆయిల్ చల్లాలని, సాయంత్రం సమయంలో కిటికీలు వేసుకుని దోమతెరలు వాడాలని, ఇళ్లల్లో వేపాకు వేసుకోవాలని సూచించారు. ప్రజలు మురికి కాలువల్లో చెత్త వేయరాదని, ఎక్కువగా హాని చేసే దోమలు మంచినీటి నిల్వ ప్రాంతాలలో పెరుగుతాయి కాబట్టి వారానికి ఒకసారి కడిగి, ఆరబెట్టి మూతలు పెట్టుకోవాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం సందర్శించి, పిల్లలకు హ్యాండ్ వాష్ టెక్నిక్ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్‌సి పవర్ పేట వైద్యాధికారి డాక్టర్ గౌతమ్, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, ఆరోగ్య కార్యకర్తలు కవిత, రోజా జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

చింతలపూడి : నా దృష్టికి వచ్చిన సమస్యను వెంటనే పరిష్కరించటమే లక్ష్యమని, సమస్య ఎక్కడుంటే నేను అక్కడే ఉంటానని, కూటమి ప్రభుత్వం ప్రజలందరికీ అండగా ఉంటుందని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగ రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి శ్రీఆంజనేయ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు చింతలపూడి, లింగపాలెం ఏరియాలో మొక్కజొన్న ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకొని, బయటి నుంచి లారీలను తెచ్చుకొని నడుపుకుంటున్నారని, ఇలా చేయడం వల్ల చింతలపూడి పరిధిలో ఉన్న లారీలకు ఉపాధి కోల్పోతున్నామని ఎంఎల్ఎ దృష్టికి తీసుకువచ్చారు. చింతలపూడి లారీలకు ఉపాధి కల్పించాలని ఎంఎల్ఎని కోరడంతో తక్షణమే ఎంఎల్ఎ ముత్తారెడ్డికి, పెదబాబుకి ఆదేశాలు జారీ చేసి మొక్కజొన్న ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్స్, లారీ అసోసియేషన్ వారితో సమావేశం ఏర్పాటు చేశారు. చింతలపూడి లారీలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, రవాణా ఛార్జీలు కూడా గిట్టుబాటు అయ్యే విధంగా కిరాయిలు ఇవ్వాలని మొక్కజొన్న ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్స్‌ని కోరారు. మొక్కజొన్న ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్స్ స్పందించి చింతలపూడి లారీలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని, లారీ కిరాయిలు కూడా గిట్టుబాటు ధర ఇస్తామని ఒప్పుకోవడంతో చింతలపూడి లారీ అసోసియేషన్ వారు ఎంఎల్ఎని ఉపాధి కల్పించాలని కోరిన ఒకరోజు వ్యవధిలోనే మా సమస్యను పరిష్కారం చేసినందుకు ఎంఎల్ఎకి ధన్యవాదాలు తెలిపారు.

వైసిపి రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీగా సంధ్య

ముదినేపల్లి : మండలంలోని మాజీ ఎంపిపి గంటా సంధ్య వైసిపి రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీగా నియమితులయ్యారు. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఈమేర ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ అనుబంధ విభాగాల రాష్ట్ర సెక్రటరీలుగా పలువురిని నియమించారు. ఇందులో భాగంగా ముదినేపల్లి మండలం నుంచి గంటా సంధ్య పార్టీ రాష్ట్ర మహిళ విభాగ సెక్రటరీగా నియమితులైయ్యారు. ఎంపిపి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, వైసిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

పన్ను వసూళ్ల లక్ష్యాలను సాధించాలి

ఏలూరు సిటీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలని పురపాలక శాఖ రాజమండ్రి రీజనల్ డైరెక్టర్ కం అప్పీలేట్ కమిషనర్ నాగ నరసింహారావు మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. స్థానిక గోకుల్ కల్యాణ మండపంలో శుక్రవారం రెవెన్యూ వసూళ్లు, 15 శాతం ఫైనాన్స్ కమిషన్ ఫండ్స్ యుటిలైజేషన్, పాట్ హెూల్స్ ఫ్రీ రోడ్స్, తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, అధికార్లతో ఆయన సమీక్షించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భాను ప్రతాప్, అడిషనల్ కమీషనర్లు పాల్గొన్నారు.

'రైతులందరికీ పంట రుణాలివ్వాలి'

ఏలూరు అర్బన్ : జిల్లాలో కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇచ్చి ఆదుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రికి ఎపి కౌలు రైతు సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం సర్ సి ఆర్ రెడ్డి డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో ఉన్న జిల్లా లీడ్ బ్యాంక్(యూనియన్ బ్యాంక్) వద్ద కౌలు రైతు సంఘం నాయకులు నిరసన తెలిపి మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ప్రతి వినతినీ పరిష్కరిస్తాం : ఎంఎల్ఎ

దెందులూరు: తమ సమస్యలను తెలియచేస్తూ ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వాటిని పరిష్కరించేలా చేస్తున్నామని, కూటమి ప్రభుత్వంలో ఎల్లప్పుడూ ప్రజలకే తొలి ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం నియోజకవర్గంలోని పలువురు కూటమి నాయకులు చింతమనేనిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

చింతలపూడి: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగ పడతాయని చింతలపూడి ఎంఇఒ కిరణ్ బాబు అన్నారు. నియోజకవర్గ జోనల్ స్థాయి ఆటల పోటీలను స్థానిక గవర్నమెంట్ హైస్కూల్‌లో శుక్రవారం ప్రారంభించారు.